# సాక్షి అనకాపల్లి

శుక్రవారం । 3 । ఫిబ్రవరి । 2023






## అప్పన్న సన్నిధిలో గోవా సీఎం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని గురువారం గోవా సీఎం డాక్టర్ ప్రమోద్ సావంత్ దర్శించుకున్నారు.



## యువతకు ఉజ్వల భవిత

'సాక్షి ప్రీమియర్ లీగ్' క్రికెట్ టోర్నమెంట్ గురువారం ముగిసింది. ముగింపు కార్యక్రమంలో విశాఖ సీపీ శ్రీకాంత్ పాల్గొన్నారు.

8లో



## షబ్నంకు ఘన స్వాగతం

విశాఖ: మహిళా క్రికెటర్ షబ్నం గురువారం విశాఖ చేరుకున్నారు. అండర్–19 ప్రపంచ కప్ సాధించిన భారత జట్టులో ఆమె సభ్యురాలు.

## న్యూస్‌రీల్

### చోడవరంలో స్కిల్ హబ్

చోడవరం రూరల్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్కిల్ హబ్ ఏర్పాటు చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ) ఆధ్వర్యంలో ఈ స్కిల్ హబ్‌ను నిర్వహించనున్నట్టు సంస్థ ప్రతినిధి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్కిల్ హబ్ ద్వారా నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ, ఉపాధి రంగాలలో శిక్షణతోపాటు, ఉపాధి కల్పించనున్నట్టు పేర్కొన్నారు. ముందుగా మహిళలకు కుట్టు యంత్రం ఆపరేటర్ శిక్షణను ఇవ్వనున్నారు. ఈ నెల 4 నుంచి ప్రారంభమయ్యే శిక్షణలో చేరాలనుకునే మహిళలు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఆధార్ కార్డు, ఇతర ధ్రువపత్రాల నకళ్లతో చోడవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సంప్రదించాల్సిందిగా తెలిపారు.

### సాయితేజస్వితశ్రీకి తైక్వాండోలో రజత పతకం



సాయితేజస్విశ్రీతో కోచ్ చందు

ఎస్.రాయవరం: జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో అడ్డురోడ్డు తైక్వాండో క్లబ్ విద్యార్థి జి.సాయితేజస్వితశ్రీ రజత పతకం సాధించినట్టు కోచ్ చందు గురువారం తెలిపారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం బరేలిలో గత నెల 27 నుంచి 29 వరకు జరిగిన పోటీల్లో ఆమె ఈ మెడల్ సాధించినట్టు పేర్కొన్నారు. ఈ మేరకు కుటుంబ సభ్యులు, తైక్వాండో అసోసియేషన్ పెద్దలు తేజస్వితశ్రీని అభినందించారు.

### 5న జాతీయ ఉపకార వేతన పరీక్ష

అనకాపల్లిటౌన్ : జాతీయ ఉపకారవేతన పరీక్ష(ఎన్ఎంఎంఎస్)ను ఈ నెల 5న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించనున్నట్టు ప్రభుత్వ పరీక్షల సంచాలకులు డి.దేవానందరెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థుల హాల్‌టిక్కెట్లను తమ కార్యాలయ వెబ్‌సైట్ www.bse.ap.gov.in నందు స్కూల్ లాగిన్‌లో అందుబాటులో ఉంచినట్టు వెల్లడించారు. హాల్‌టిక్కెట్లు పొందని విద్యార్థులు తమ ప్రధానోపాధ్యాయులను సంప్రదించి హాల్‌టిక్కెట్లు పొందవచ్చన్నారు.

### త్వరితగతిన టిడ్కో ఇళ్ల నిర్మాణం



మాట్లాడుతున్న టిడ్కో చైర్మన్ ప్రసన్నకుమార్

దొండపర్తి (విశాఖ దక్షిణ): రాష్ట్రంలో 1.5 లక్షల ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ ఇంజినీరింగ్, జీవీఎంసీ యూసీడీ అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశించారు. గురువారం వీఎంఆర్‌డీఏ సమావేశ మందిరంలో టిడ్కో గృహాల పనులపై అధికారులు, కాంట్రాక్టింగ్ ఏజెన్సీ ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ జిల్లాలో 6,728, విజయనగరంలో 4,224, శ్రీకాకుళంలో 2,720 మొత్తంగా 13,672 గృహాలను ఏప్రిల్ 23వ తేదీనాటికి అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని చెప్పారు. అన్ని ప్రాజెక్టు ప్రాంతాల్లోను మురుగునీటి శుద్ధి, రోడ్లు, మంచినీటి సరఫరా, డ్రైనేజీ, విద్యుత్ ఇలా అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. ఏపీ టిడ్కో హౌసింగ్‌పై లబ్ధిదారులకు అవగాహన కలిగించేందుకు ప్రత్యేకంగా ఏపీ టిడ్కో యూట్యూబ్ చానల్‌ను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. టిడ్కో ఎస్ఈ డి.శ్రీరామ్మూర్తి, యూసీడీ పీడీ పాపునాయుడు పాల్గొన్నారు.

### తల్లికి తలకొరివి పెట్టిన కూతురు



కె.జె.పురంలో తల్లి సత్యవతి చితికి నిప్పంటిస్తున్న కుమార్తె అమ్మాజీ

మాడుగుల రూరల్ : ఆ తల్లికి కొడుకుల్లేరు. కుమార్తే అన్నీ తానై తలకొరివి పెట్టి కన్నరుణం కొంత తీర్చుకుంది. వివరాలు ఇలా వున్నాయి. మండలంలో కె.జె.పురానికి చెందిన కాళ్ల సత్యవతి, బలరామస్వామికి ఒక కుమార్తె మాత్రమే ఉంది. అమె కూడా రాజస్థాన్‌లో భర్తతో ఉంటోంది. బలరామస్వామి అనారోగ్యం బారిన పడి ఎటూ కదల్లేని స్థితిలో ఉన్నాడు. వారం రోజులు క్రితం సత్యవతి కూడా అనారోగ్యానికి గురవడంతో స్థానిక పీహెచ్‌సీలో వైద్యం అందించారు. వారి సూచనల మేరకు మాడుగుల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, చికిత్స అందించారు. ఆరోగ్యం కొంత మెరుగుపడటంతో ఇంటికి తీసుకొచ్చారు. అనారోగ్యం తిరగబడి ఇంటి వద్ద ఆమె గురువారం మధ్యాహ్నం మృతి చెందారు. కొడుకుల్లేకపోవడంతో కుమార్తె అమ్మాజీ తల్లి సత్యవతికి తలకొరివి పెట్టింది.

# హైవే మిలమిల

- సెంట్రల్ లైటింగ్ స్తంభాలకు ఎల్‌ఈడీ బల్బుల బిగింపు
- అధిక కాంతి.. విద్యుత్ ఆదా
- ప్రమాదాల నివారణకు దోహదం





పాయకరావుపేట వద్ద జాతీయ రహదారిపై ఎల్‌ఈడీ కాంతులు (ఇన్‌సెట్) స్తంభాలకు ఎల్‌ఈడీ బల్బులు బిగిస్తున్న సిబ్బంది

నక్కపల్లి: జాతీయ రహదారికి ఎల్‌ఈడీ వెలుగులొచ్చాయి. నేషనల్ హైవే అధికారులు జాతీయ రహదారిపై ప్రధాన కూడళ్ల వద్ద ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్ స్తంభాలకు ఎల్‌ఈడీ లైట్లు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఉన్న సాధారణ బల్బులను తొలగించి అధిక కాంతినిచ్చే ఎల్‌ఈడీ లైట్లు అమర్చడంతో రహదారి ధగధగలాడుతోంది. దీంతో విద్యుత్ ఆదా చేయవచ్చని అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే పాయకరావుపేట, నామవరం ప్రాంతాల్లో ఎల్‌ఈడీ బల్బులు అమర్చే ప్రక్రియ పూర్తయింది. పాయకరావుపేట నుంచి అగనంపూడి వరకు గతంలో హైవే వారు ఏర్పాటు చేసిన స్తంభాలకు ఎల్‌ఈడీ బల్బులు వేసే పనులు జోరందుకున్నాయి. అడ్డురోడ్డు, యలమంచిలి, కశింకోట మండలం నర్సింగబిల్లి, తాళ్లపాలెం, పాయకరావుపేట, నామవరం, అడ్డురోడ్డు, అనకాపల్లి, లంకెలపాలెం, అగనంపూడి వంటి ప్రధాన కూడళ్ల వద్ద జాతీయ రహదారిని నాలుగు లేన్‌లుగా విస్తరించిన తర్వాత సెంట్రల్ లైటింగ్‌ను ఏర్పాటు చేశారు. ఈ ప్రాంతాల్లో రోడ్లను ఆనుకొని గ్రామాలు, నివాస ప్రాంతాలు ఉండటం జన సంచారం ఎక్కువగా ఉండడంతో ప్రమాదాలు నివారించేందుకు ఈ లైటింగ్ వ్యవస్థ ఏర్పాటు చేశారు. ఇటీవల కాలంలో జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. గత రెండేళ్లలో 1637 రోడ్డు ప్రమాదాలు జరిగాయి. ఇందులో 600కిపైగా జాతీయ రహదారిపైనే జరిగాయి. అధికారులు జాతీయ రహదారిపై 37 బ్లాక్ స్పాట్‌లు గుర్తించారు. ఇక్కడే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయి. సెంట్రల్ లైటింగ్ ఉన్న చోట కూడా ప్రమాదాలు జరుగుతున్నాయి. తాజాగా సెంట్రల్ లైటింగ్ ఉన్న నామవరంలో రోడ్డు పక్కన నిలబడి మాట్లాడుకుంటున్న అయిదుగురిని లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే చనిపోయారు. మరో ముగ్గురు గాయపడ్డారు. లైట్లు సరిగ్గా వెలగకపోవడం, చీకటి కారణంగానే ఈ ప్రమాదం జరిగిందన్న విమర్శలున్నాయి. దీన్ని దృష్టిలో ఉంచుకొని ఈ సెంట్రల్ లైటింగ్ స్తంభాలకు ఎల్‌ఈడీ బల్బులు బిగించారు. దీంతో జాతీయ రహదారి ఇప్పుడు ఎల్‌ఈడీ వెలుగుల్లో తళుక్కుమంటోంది. అధికారులు తీసుకున్న చర్యల పట్ల సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

## ఖాళీగా ఉన్న 'స్థానిక' పదవులకు నేడు ఎన్నిక

ఎస్.రాయవరం/పాయకరావుపేట/కోటవురట్ల: ఎస్.రాయవరం, పాయకరావుపేట, కోటవురట్ల మండలాల్లో ఖాళీగా ఉన్న ఎంపీపీ, వైస్ ఎంపీపీ, కో ఆప్షన్ సభ్యుడు పదవులకు శుక్రవారం ఎన్నికలు నిర్వహించనున్నారు. ఉదయం 11 గంటలకు ఆయా మండల పరిషత్ కార్యాలయాల్లో నిర్వహించనున్న ప్రత్యేక సమావేశాల్లో సభ్యులు చేతులెత్తి ఎంపీపీ, వైస్ ఎంపీపీలను ఎన్నుకుంటారు. ఎస్.రాయవరం ఎంపీపీ ఎన్నిక ఏకగ్రీవం అయ్యే అవకాశం ఉంది. ఇక్కడ ఎంపీటీసీల సంఖ్య 21. వైఎస్సార్‌సీపీ 17 స్థానాలు (ఒక ఎంపీటీసీ మృతి చెందారు), టీడీపీ 3, జనసేన ఒక స్థానంలో గెలిచాయి. ప్రిసైడింగ్ అధికారిగా డీఆర్‌డీఏ పీడీ డి.లక్ష్మీపతి వ్యవహరిస్తున్నారు. పాయకరావుపేట వైస్ ఎంపీపీ–2 ఎన్నిక నల్లేరుపై నడకలా సాగనుంది. మొత్తం 27 ఎంపీటీసీల స్థానాల్లో వైఎస్సార్‌సీపీకి 16, టీడీపీకి 8, జనసేనకు ఒకటి, ఇండిపెండెంట్లకు రెండు స్థానాలు దక్కాయి. ఇక్కడ ప్రిసైడింగ్ అధికారిగా ఏపీ సీఎస్ఎఫ్ అనకాపల్లి జిల్లా ప్రాజెక్టు మేనేజర్ లచ్చన్న వ్యవహరిస్తున్నారు. కోటవురట్ల మండలంలో కోఆప్షన్ సభ్యురాలు రాజీనామా చేయడంతో ఎన్నిక అనివార్యమైంది. ప్రిసైడింగ్ అధికారిగా పంచాయతీరాజ్ డీఎల్‌డీవో ఉదయశ్రీ వ్యవహరిస్తున్నారు. ఇక్కడ 16 మంది ఎంపీటీసీల్లో 11 మంది వైఎస్సార్‌సీపీ సభ్యులు, ఐదుగురు టీడీపీ సభ్యులు ఉన్నారు. ఉదయం 10 గంటల నుంచి నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, ఉపసంహరణ, అనంతరం ఎన్నిక జరుగుతాయి.

## మరింత చేరువగా పశు వైద్య సేవలు



బయ్యవరంలో సంచార వెటర్నరీ అంబులెటరీ క్లినిక్‌ను ప్రారంభిస్తున్న మంత్రి అమర్‌నాథ్

- సంచార వెటర్నరీ అంబులేటరీ క్లినిక్ ప్రారంభం
- 1962కు ఫోన్ చేస్తే తక్షణ వైద్యం : మంత్రి అమర్‌నాథ్

కశింకోట: పశు వైద్య సేవలు రైతులకు మరింత చేరువయ్యాయని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. మండలంలోని బయ్యవరంలో సంచార వెటర్నరీ అంబులేటరీ క్లినిక్‌ను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పశు సంవర్ధక శాఖ జిల్లా అధికారి బెహరా ప్రసాదరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ పాడి అభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని, దీనిలో భాగంగా పశువులకు వైద్యాన్ని చేరువ చేయడానికి సంచార వెటర్నరీ అంబులెటరీ క్లినిక్‌ను ఏర్పాటు చేశారన్నారు. దీన్ని మొదటి విడతగా నియోజకవర్గానికి ఒకటి వంతున సమకూర్చగా సత్ఫలితాలు రావడంతో రెండో విడతలో మరో వాహనాన్ని కేటాయించారన్నారు. 1962 హెల్ప్‌లైన్ నెంబర్‌కు ఫోన్ చేస్తే అంబులెన్స్ సకాలంలో చేరుకొని పశు వైద్యం అందిస్తుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గొల్లవిల్లి జయ, పశు వైద్య కేంద్రం అనకాపల్లి సహాయ సంచాలకురాలు బి.సౌజన్య, జగనన్న పాల వెల్లువ నోడల్ అధికారి పి.భానుబాబు, పశు వైద్యాధికారులు చైతన్యమణి, ఆల్ఫాన్సా జార్జి, పి.స్వామినాయుడు, సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

# కొండలెక్కి.. తుప్పలు దాటి..

- నేరేడుబంద గ్రామాన్ని సందర్శించిన ఐటీడీఏ పీవో
- గిరిజనుల సమస్యలకు తక్షణ స్పందన
- స్కూల్ గోడలపై రేకుల ఏర్పాటుకు రూ.లక్ష మంజూరు
- ఉపాధి పనులు కల్పించాలని, విద్యాకానుక కిట్లు అందించాలని ఆదేశం



రచ్చబండపై గ్రామస్తులతో పీవో గోపాలకృష్ణ సమావేశం

రావికమతం: సుదూర కొండలపై ఉన్న ఆదివాసీ పల్లె అది. ఆ కుగ్రామంలో 60 కుటుంబాలున్నాయి. పదిమంది పిల్లలు సమీపంలోని అయిదు కిలోమీటర్ల దూరంలో ఉన్న పాఠశాలకు తుప్పలు, పొదల నడుమ నడిచి.. ఒకొక్కసారి గుర్రాలపై వెళ్తున్నారు. గిరిజన సంఘాల ప్రతినిధులు దీనిపై ఆందోళనలు చేయడం, ఇటీవల పత్రికల్లో రావడంతో పీవో గోపాలకృష్ణ స్పందించారు. రవాణా సదుపాయం లేని ఆ గ్రామానికి గురువారం కొండలు కోనలు ఎక్కి చేరుకున్నారు. అతి ప్రయాస పడి వచ్చిన ఆయనకు, అధికార్ల బృందానికి ఆ గ్రామ గిరిజనులు ఘన స్వాగతం పలికారు. గిరిజనులతో మమేకమైన పీవో వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బడికి వెళ్లేందుకు పిల్లలు అడవిమార్గంలో నడిచి వెళ్తున్నారని గ్రామంలో స్కూల్ ఏర్పాటు చేయాలని, ఇప్పటికే గోడలు నిర్మించామని తెలుపగా.. ఆ గోడలపై రేకుల ఏర్పాటుకు రూ.లక్ష మంజూరు చేశారు. వారి పిల్లలకు జగనన్న విద్యాకానుక కిట్లు అందలేదని తెలుపగా వాటిని వారం రోజుల్లోగా అందించాలని ఎంపీడీవో వెంకన్నబాబుకు ఆదేశించారు.

ఉపాధి హామీ పథకం పనులు తమకు అందడం లేదని తెలియజేయగా తక్షణం వారికి పనులు కల్పించాలని జి.మాడుగుల, రావికమతం ఎంపీడీవోలకు ఆదేశించారు. పీవో పర్యటనలో తహసీల్దార్ మహేశ్వరరావు, చీమలపాడు సర్పంచ్ గంగరాజు, గిరిజన సంఘం నాయకులు గోవింద, అప్పారావు పలువురు పాల్గొన్నారు.



నేరేడుబంద చేరుకునేందుకు కొండలెక్కుతున్న పీవో, ఇతర అధికారులు

## కేకే లైన్లో పట్టాలు తప్పిన గూడ్స్ రైలు



పట్టాలు తప్పిన గూడ్స్ వ్యాగన్లు.. తెగిపడిన ఓహెచ్‌సీ విద్యుత్ తీగెలు, విద్యుత్ స్తంభాలు

అనంతగిరి: కొత్తవలస–కిరండూల్ (కేకే) లైన్‌లో గూడ్సు రైలు పట్టాలు తప్పడంతో రైళ్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. అనంతగిరి మండల పరిధిలో శివలింగపురం రైల్వేస్టేషన్ యార్డు 45వ కిలోమీటర్ వద్ద గురువారం ఉదయం 6 గంటల సమయంలో విశాఖపట్నం నుంచి కిరండూల్ వెళుతున్న గూడ్స్ రైలు పట్టాలు తప్పింది. 8 వ్యాగన్లు పట్టాలు తప్పడంతో ట్రాక్ బాగా దెబ్బతింది. ఓహెచ్‌సీ విద్యుత్ లైన్ తెగిపోవడంతోపాటు.. పట్టాలు తప్పిన బోగీలు ఢీకొట్టడంతో రెండు స్తంభాలు ధ్వంసమయ్యాయి. ఉదయం నుంచి కేకే లైన్‌లోని రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. విశాఖ, కిరండూల్ నుంచి రావలసిన పాసింజర్ రైళ్లు, జగదల్‌పూర్ ఎక్స్‌ప్రెస్ రద్దయ్యాయి. ప్రమాదం జరిగిన వెంటనే రైల్వే సిబ్బంది యుద్ధప్రాతిపదికన ఘటన స్థలానికి చేరుకుని, పునరుద్ధరణ పనులు ప్రారంభించారు. గత నెలలో విశాఖపట్నం నుంచి కిరండూల్ వెళుతున్న పాసింజర్ రైలు శివలింగపురం రైల్వేస్టేషన్ యార్డులోనే పట్టాలు తప్పింది. అదే ప్రదేశంలో గురువారం గూడ్స్‌రైలు పట్టాలు తప్పిన ఘటన చోటు చేసుకుంది. శుక్రవారం మధ్యాహ్నానికి పునరుద్ధరణ పనులు పూర్తయ్యే అవకాశముంది. డీఆర్ఎం అనూప్‌కుమార్ సత్పతి సంఘటన స్థలానికి చేరుకొని పనులను పరిశీలించారు.

## రేపు జీవీఎంసీ స్థాయీ సంఘ సమావేశం

- తొలిసారిగా వంద అంశాలపై చర్చ



దాబాగార్డెన్స్(విశాఖ దక్షిణ): జీవీఎంసీ స్థాయీ సంఘ సమావేశం శనివారం నిర్వహించనున్నారు. స్టాండింగ్ కమిటీ చైర్‌పర్సన్ గొలగాని హరి వెంకట కుమారి అధ్యక్షతన స్థాయీ సంఘ సమావేశ మందిరంలో ఆ రోజు ఉదయం 11 గంటలకు ప్రారంభం కానుంది. ఈ సమావేశంలో తొలిసారిగా 100 అంశాలు సభ్యుల ఆమోదానికి రానున్నాయి. మార్చి 28,29 తేదీల్లో జరగనున్న జీ–20 సమ్మిట్ నేపథ్యంలో నగర సుందరీకరణ సంబంధించిన అంశాలపై సభ్యులు చర్చించి ఆమోదించనున్నారు. వివిధ రహదారుల్లో లైన్ మార్కింగ్, స్టడ్లు ఏర్పాట్లు, ఫుట్‌పాత్, డివైడర్ల మరమ్మతులు, ఫ్లైఓవర్ కాలమ్స్ పెయింటింగ్, ట్రీ ప్లాంటేషన్, పబ్లిక్ వర్క్స్, తదితర అంశాలు పరిపాలన ఆమోదానికి చర్చకు రానున్నాయి. సౌరశక్తి సహాయంతో టాయిలెట్ బ్లాక్, బీచ్ లాన్లలో సోలార్ చెట్టు నిర్మాణం, అవుట్‌డోర్ సీటింగ్‌కు పారామెట్రిక్ వేవ్ బెంచ్ ఏర్పాటు, సెంటర్ మీడియన్లలో ఎల్‌ఈడీ స్క్రీన్ పోల్స్ తదితరవి ఏర్పాటుపై చర్చ సాగనుంది.

వీటితో పాటు ప్రధాని మోదీ విశాఖ విచ్చేసిన సందర్భంగా వీఐపీల సందర్శనాల ఏర్పాట్లకై నవ్యయం మంజూరు, సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్షన్ ఏరియాలో అద్దె ప్రాతిపదికన పొక్లెయిన్లు, టిప్పర్లు ఏర్పాటు చేసి చెత్తను డంపింగ్ యార్డ్‌కు తరలించినందుకైన వ్యయాన్ని కాంట్రాక్టర్‌కు చెల్లించడం, నగరంలోని వివిధ శ్మశాన వాటిక అభివృద్ధి, తదితర 100 అంశాలపై చర్చ సాగనుంది.

# ఫ్యామిలీ ఫిజీషియన్‌తో చేరువైన వైద్యం

- ట్రైనీ కలెక్టర్ ధాత్రీరెడ్డి
- గుల్లేపల్లి పర్యటనలో అంగన్‌వాడీ, హెల్త్ వెల్‌నెస్, ఆర్బీకే కేంద్రాల తనిఖీ


అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ట్రైనీ కలెక్టర్ ధాత్రీరెడ్డి

**కె.కోటపాడు :** ప్రజల చెంతకే మెరుగైన వైద్యాన్ని తీసుకెళ్లాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని అమలు చేస్తుందని ట్రైనీ కలెక్టర్ ధాత్రీరెడ్డి అన్నారు. మండలంలో గుల్లేపల్లి గ్రామంలో గురువారం ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో నిర్వహిస్తున్న ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్య సేవలను ఆమె అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలో గల హెల్త్ వెల్‌నెస్, ఆర్బీకే, అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. హెల్త్ వెల్‌నెస్ కేంద్రంలో 14 రకాలైన పరీక్షలతో పాటు వ్యాధిగ్రస్తులకు 64 రకాలైన మందులు అందుబాటులో ఉన్నట్లు ట్రైనీ కలెక్టర్‌కు ఎంఎల్‌హెచ్‌పీ పావని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రంలో ప్రీస్కూల్ చిన్నారులు, గర్భవతులు, బాలింతలకు అనుబంధ పౌష్టికాహారం అందించనున్నట్లు అంగన్‌వాడీ కార్యకర్త మణమ్మ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ బండారు దేముళ్లు, వైద్యాధికారి సుబ్రహ్మణ్యం, ఎంపీహెచ్ ఈవో కేవీ రాజశేఖర్, ఈవోఆర్డీ ప్రసాద్, ఏఈవో లైలాదేవి, పంచాయితీ కార్యదర్శి సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

# వివాహితపై కత్తితో దాడి

- ఆపై నిందితుడి ఆత్మహత్యాయత్నం
- కేసు నమోదు
- బాధితురాలిని పరామర్శించిన ఎస్పీ


కేజీహెచ్‌లో బాధితురాలి బంధువుతో మాట్లాడుతున్న అనకాపల్లి ఎస్పీ గౌతమి సాలి

**రోలుగుంట :** వివాహితపై ఓ వ్యక్తి చాకుతో దాడి చేసి గాయపరిచిన ఘటన కంచుగుమల గ్రామంలో గురువారం జరిగింది. ఆపై నిందితుడు కూడా పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఇద్దరినీ విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. ఘటనపై అందిన సమాచారంతో ఎస్‌ఐ బి.నాగకార్తీక్ కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు గురువారం సాయంత్రం విలేకరులకు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని బల్లిపాలేనికి చెందిన వివాహిత(22)కి, ఇదే గ్రామానికి చెందిన కోడి రమణ((26)కు వివాహేతర సంబంధం ఉండేది. కోడి రమణపై పలు గంజాయి కేసులున్నాయి. గంజాయి కేసులో పట్టుబడిన రమణ జైలుకి వెళ్లి కొద్ది రోజుల క్రితమే వచ్చాడు. తనతో సంబంధం ఉన్న వివాహిత మహిళ కుంచుగుమల వచ్చినట్టు తెలుసుకొని గురువారం అక్కడకు వచ్చి ఆమెతో సరదాగా మాట్లాడగా ఆమె ఇప్పుడు నాతో సంబంధం వద్దు అని నిరాకరించింది. దీంతో ఆగ్రహించిన రమణ తన దగ్గరున్న చాకుతో ఆమె మెడపైన దాడి చేసి గాయపరిచాడు. తరువాత రమణ కూడా పురుగు మందు తాగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. దీంతో బంధువులు వారిని విశాఖ కేజీహెచ్‌కి తరలించి చికిత్స చేయిస్తున్నారు. విషయం తెలుసుకున్న అనకాపల్లి ఎస్పీ గౌతమి సాలి కేజీహెచ్‌కు వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితులు ఆరా తీసి వారు ప్రాణాపాయం నుంచి బయటపడినట్టు తెలుసుకున్నారు.



## 4.3 కిలోల బరువుతో శిశువు జననం

**రాజవొమ్మంగి:** స్థానిక పీహెచ్‌సీలో గురువారం రాత్రి సంపూర్ణ ఆరోగ్యంతో 4.3 కిలోల బరువుతో ఆడశిశువు జన్మించింది. పురిటినొప్పులతో పీహెచ్‌సీకి వచ్చిన రాజవొమ్మంగికి చెందిన పెదిరెడ్ల శిరీషను పరీక్షించిన మెడికల్ ఆఫీసర్ శ్రీదుర్గ కాన్పు కష్టం అని భావించారు. అయితే సమయం లేకపోవడంతో ఆస్పత్రిలోనే స్కానింగ్ చేసి బిడ్డ పొజిషన్ బాగానే ఉందని భావించిన డాక్టర్ శ్రీదుర్గ కష్టమైనా ప్రసవం చేశారు. ఆమెకు మరో మెడికల్ ఆఫీసర్ లిఖిత సహాయం చేశారు.

# క్రమశిక్షణతో యువతకు ఉజ్వల భవిత


జూనియర్స్ విభాగంలో రన్నర్స్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజ్ జట్టు


జూనియర్స్ విభాగంలో విన్నర్స్ సాయి గణపతి పాలిటెక్నిక్ కాలేజ్ జట్టు


సీనియర్స్ విభాగంలో రన్నర్స్ దాడి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ జట్టు


సీనియర్స్ విభాగంలో విన్నర్స్ ఎస్‌ఎస్‌ఆర్‌ఐటీ కాలేజ్ జట్టు

- శక్తి, సామర్థ్యాలను విద్య, ఆటల కోసం వినియోగించాలి
- సాక్షి ప్రీమియర్ లీగ్ ముగింపు కార్యక్రమంలో సీపీ శ్రీకాంత్
- జూనియర్స్, సీనియర్స్ విభాగంలో విజేతలకు ట్రోఫీలు అందజేత

SAKSHI | SAKSHI DIGITAL | MEDIA GROUP — SPL SAKSHI PREMIER LEAGUE — District sponsor CMR SHOPPING MALL The joy of life ANDHRAPRADESH | TELANGANA

**దొండపర్తి (విశాఖ దక్షిణ):** యువత తమ శక్తి, సామర్థ్యాలను విద్య, ఆటల కోసం వినియోగించడం ద్వారా క్రమశిక్షణతో ఉజ్వల భవిష్యత్‌ను తీర్చిదిద్దుకోగలుగుతారని నగర పోలీస్ కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్ అన్నారు. ఏయూ గోల్డెన్ జూబ్లీ మైదానంలో గురువారం జరిగిన 'సాక్షి ప్రీమియర్ లీగ్' క్రికెట్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు కూడా ముఖ్యమన్నారు. విద్య జ్ఞానాన్ని అందిస్తే... ఆటలు శారీరక దృఢత్వం, ఏకాగ్రత, నాయకత్వం, ఆత్మవిశ్వాసం, నీతి, విలువలు వంటి జీవిత నైపుణ్యాలను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. భౌతిక ప్రయోజనాలతోపాటు సామాజిక, వ్యక్తిత్వ వికాసానికి బాటలు వేస్తాయన్నారు. 'సాక్షి ప్రీమియర్ లీగ్' ద్వారా జిల్లాలో ఇంటర్, డిగ్రీ, ఇంజినీరింగ్, పీజీ కాలేజీల మధ్య క్రికెట్ పోటీలు నిర్వహించిన సాక్షి మీడియా గ్రూప్‌ను అభినందించారు. వీడీసీఏ అంపైర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జోగారావు మాట్లాడుతూ విద్యార్థులు తమ జీవితంలో లక్ష్యాలను సాధించడానికే కాకుండా ఆరోగ్యవంతమైన జీవనానికి క్రీడలు ఉపయోగకరంగా ఉంటాయన్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో క్రీడాకారులుగా ఎదగాలంటే విద్యార్థి దశ నుంచే ప్రణాళికాబద్ధమైన నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలని సూచించారు.

**విజేతలకు సీపీ శ్రీకాంత్ ట్రోఫీలు**

సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో సీఎంఆర్ షాపింగ్ మాల్ స్పాన్సర్‌గా వ్యవహరించిన ఈ టోర్నమెంట్‌లో జూనియర్స్ విభాగంలో సాయి గణపతి పాలిటెక్నిక్ కాలేజ్ (గిడిజాల) విన్నర్‌గా నిలవగా... ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజ్(కంచరపాలెం) రన్నరప్‌గా నిలిచింది. అలాగే సీనియర్స్ విభాగంలో ఎస్‌ఎస్‌ఆర్‌ఐటీ కాలేజ్ (శొంఠ్యాం) ట్రోఫీని కైవసం చేసుకుంది. దాడి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ రన్నరప్ స్థానాన్ని దక్కించుకుంది. విన్నర్, రన్నర్ జట్లకు నగర పోలీస్ కమిషనర్ సీహెచ్.శ్రీకాంత్ చేతుల మీదుగా ట్రోఫీలను అందజేశారు. కార్యక్రమంలో సాక్షి అడ్వర్టైజ్‌మెంట్ డీజీఎం శ్రీనివాస్, సాక్షి ఛానల్ విశాఖ కరస్పాండెంట్ రామచంద్రరావు పాల్గొన్నారు.

**విజేతగా సాయి గణపతి పాలిటెక్నిక్ కాలేజ్**

జూనియర్స్ విభాగంలో ఉదయం జరిగిన ఫైనల్స్ పోరులో సాయి గణపతి పాలిటెక్నిక్ కాలేజ్ (గిడిజాల) 27 పరుగుల తేడాతో ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాల (కంచరపాలెం)పై విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ చేపట్టిన సాయి గణపతి పాలిటెక్నికల్ కాలేజ్ నిర్ణీత 10 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 72 పరుగులు చేసింది. తనిష్క్ 20 బంతుల్లో 2 ఫోర్లతో 28 పరుగులు, నూకేష్ 17 పరుగులు చేశారు. 73 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజ్ జట్టు 46 పరుగులకే కుప్పకూలిపోయింది. దుర్గ 15, గణేష్ 11 పరుగులు చేశారు. కుమార్ 5 వికెట్లు తీసి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించాడు. అలాగే లోకేష్ 2, తేజ 1 వికెట్ తీశారు.

**ట్రోఫీ గెలుచుకున్న ఎస్‌ఎస్‌ఆర్‌ఐటీ**

సీనియర్స్ విభాగంలో మధ్యాహ్నం జరిగిన ఫైనల్స్‌లో దాడి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ (అనకాపల్లి) జట్టుపై 24 పరుగులు తేడాతో ఎస్‌ఎస్‌ఆర్‌ఐటీ కాలేజ్ (శొంఠ్యాం) జట్టు ఘన విజయం సాధించింది. టాస్ గెలిచిన దాడి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ జట్టు బౌలింగ్ ఎంచుకుంది. దీంతో తొలుత బ్యాటింగ్ చేపట్టిన ఎస్‌ఎస్‌ఆర్‌ఐటీ కాలేజ్ నిర్ణీత 10 ఓవర్లలో 3 వికెట్లు నష్టపోయి 91 పరుగుల భారీ స్కోరు చేసింది. సీహెచ్.మోహన్ వాసుకిరణ్ 24 బంతుల్లో 1 సిక్స్, 6 ఫోర్లతో 46 పరుగులు, ఎల్.తేజ్‌తరుణ్ 2 సిక్సులతో 20, వి.సునీల్ 2 ఫోర్లతో 13 పరుగులు చేశారు. అనంతరం 91 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన దాడి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ జట్టు 10 ఓవర్లలో 5 వికెట్లు నష్టపోయి కేవలం 67 పరుగులు మాత్రమే చేయగలిగింది. చైతన్య 20, కుమార్ 17, కె.ప్రసాద్ 12 పరుగులు చేశారు. జి.సాయికుమార్ 2, వి.మణివరప్రసాద్ 2, సి.హెచ్.మోహన్ వాసుకిరణ్ 1 వికెట్ తీశారు.

# వలంటీర్ సేవాగుణం


విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న కిడ్నీ వ్యాధిగ్రస్తురాలు నారామణమ్మకు పింఛన్ సొమ్ము అందజేస్తున్న వలంటీర్ మహేష్

**దేవరాపల్లి:** విశాఖపట్నం కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న కిడ్నీ వ్యాధిగ్రస్తురాలికి వలంటీర్ అక్కడికి వెళ్లి పింఛన్ సొమ్మును గురువారం అందజేశారు. మారేపల్లి గ్రామానికి చెందిన మలువలస నారాయణమ్మ కిడ్నీ వ్యాధికి కేజీహెచ్‌లో చికిత్స పొందుతుంది. ఆమె అనారోగ్య విషయం తెలుసుకున్న స్థానిక వలంటీర్ కడిమిశెట్టి రమేష్ తన ద్విచక్ర వాహనంపై విశాఖలోని కేజీహెచ్‌కు చేరుకున్నాడు. ఆమె బయోమెట్రిక్ సేకరించి రూ.10 వేల పింఛన్ సొమ్మును గురువారం అందజేశాడు. కష్టంలో ఉన్న తమకు పింఛన్ సొమ్ము అందజేయడం పట్ల బాధితురాలి కుటుంబ సభ్యులు వలంటీర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. వలంటీర్ సేవా దృక్పథానికి గ్రామ పెద్దలు, ప్రజలు అభినందనలు తెలిపారు.

**శభాష్ వలంటీర్**

**అనకాపల్లిటౌన్:** విశాఖ సుశ్రుత ఆస్పత్రిలో మూడు నెలలుగా లివర్ వ్యాధితో చికిత్స పొందుతున్న మండలంలోని తుమ్మపాల గ్రామానికి చెందిన ఎ.వేణుగోపాలరావుకు గురువారం వృద్ధాప్య పింఛన్‌ను వలంటీర్ ఆళ్ల వెంకట అప్పారావు అందజేశారు. బాధితునితో పాటు కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు.


విశాఖ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగికి పింఛన్ అందిస్తున్న వలంటీర్

## పింఛన్ సొమ్ము వసూళ్లపై ఎంపీడీవో విచారణ


పింఛన్‌దారులను విచారిస్తున్న ఎంపీడీవో జయమాధవి

**నర్సీపట్నం :** నర్సీపట్నం మండలం, చెట్టుపల్లి గ్రామంలో జరిగే గౌరీ పరమేశ్వరుల పండగ ముసుగులో పింఛన్‌దారుల నుంచి సూపర్ సర్పంచ్ డబ్బులు వసూలు చేయడంపై ఎంపీడీవో జయమాధవి గురువారం విచారణ చేపట్టారు. గ్రామానికి చెందిన పింఛన్‌దారులైన కలిమి యర్రయ్యమ్మను ఎంపీడీవో స్వయం కలిసి విచారించారు. వలంటీర్ తనకు పింఛన్ సొమ్ము అందజేసిన వెంటనే తన వద్ద నుంచి రూ.500 వసూలు చేశారని లబ్ధిదారు ఎంపీడీవోకు తెలిపింది. ఆమె స్టేట్‌మెంట్‌ను ఎంపీడీవో రికార్డు చేశారు. విచారణ నివేదికను ఉన్నతాధికారులకు నివేదించి, అధికారుల ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో తెలిపారు.

## పీజీ విద్యార్థిని ఆత్మహత్య



**మర్రిపాలెం:** జ్ఞానాపురం వద్ద ఉన్న సెయింట్ జోసెఫ్ కళాశాలలో పీజీ చదువుతున్న ఓ విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. కంచరపాలెం పోలీసులు తెలిపిన వివరాలివీ.. నర్సీపట్నం ప్రాంతానికి చెందిన నున్న మాధురి(21) సెయింట్ జోసెఫ్ కళాశాల హాస్టల్‌లో ఉంటూ పీజీ చదువుతోంది. గత నెల 31న పుట్టినరోజు కావడంతో రెండు రోజుల ముందు అంటే జనవరి 29న సొంత ఊరు వెళ్లింది. బుధవారం కళాశాలకు తిరిగి వచ్చినట్టు సిబ్బంది చెబుతున్నారు. అయితే గురువారం ఉదయం మాధురి తరగతులకు హాజరు కాకపోవడంతో తోటి విద్యార్థిని ఆమె కోసం హాస్టల్ గది వద్దకు వెళ్లింది. మాధురి ఉరి వేసుకుని ఉండటాన్ని గుర్తించి కళాశాల ప్రిన్సిపాల్‌కు సమాచారం అందించింది. తోటి విద్యార్థులతో కలిసి ఆమెను కిందకు దింపి చూడగా అప్పటికే మృతి చెందినట్టు వారు గుర్తించారు. దీంతో కంచరపాలెం పోలీసులకు సమాచారం అందించారు. సీఐ విజయ్ కుమార్, ఎస్‌ఐ దివ్య భారతి ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ దివ్యభారతి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన తప్పనిసరి


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్టీవో వీర్రాజు


సత్కారం పొందిన డ్రైవర్లు

**అనకాపల్లి టౌన్ :** ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు భద్రతపై ప్రతి ఒక్కరుఅవగాహన కలిగి ఉండాలని ఆర్టీవో వీర్రాజు అన్నారు. స్థానిక ఆర్టీసీ డిపో ఆవరణలో గత నెల 27 నుంచి జరుగుతున్న రోడ్డు భద్రతా వారోత్సవాలు గురువారంతో ముగిశాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. పట్టణ ఎస్‌ఐ సత్యనారాయణ మాట్లాడుతూ ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చడంలో డ్రైవర్లు ముఖ్య భూమిక పోషిస్తారన్నారు. జిల్లా ప్రజా రవాణా శాఖ (ఆర్టీసీ) అధికారి కె.పద్మావతి మాట్లాడుతూ నెలకు 20 నుంచి 30 లక్షల మంది కుటుంబాలను సురక్షితంగా వారి గమ్యస్థానాలకు చేర్చుతూ సంస్థను లాభాల దిశగా తీసుకెళ్తున్న డ్రైవర్లను ఆమె అభినందించారు. రోడ్డు ప్రమాదాలు లేకుండా విధులు నిర్వర్తించిన జిల్లా స్థాయిలో ముగ్గురు, డిపో స్థాయిలో మరో ముగ్గురు డ్రైవర్లను ఎంపిక చేసి ప్రశంసా పత్రాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ ఎస్.సుజాత, అసిస్టెంట్ మేనేజర్ రవిచంద్ర, గ్యారేజ్ మేనేజర్ రాజేశ్వరి, డ్రైవర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

# విభజన హామీలు అమలు చేయాలి


సభలో మాట్లాడుతున్న రాము

**అనకాపల్లిటౌన్ :** అనకాపల్లి కేంద్రంగా డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు వై.రాము డిమాండ్ చేశారు. గత నెల 25న ప్రారంభమైన విద్యార్థి యువజన సంఘాల సమర యాత్ర 500 మంది విద్యార్థులతో స్థానిక నెహ్రూచౌక్‌కు గురువారం చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రానికి ప్రత్యేక హోదా కల్పించి, విభజన హామీలు అమలు చేయాలని కోరారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిలిపివేయాలని, పెట్రోలియం యూనివర్సిటీ, గిరిజన యూనివర్సిటీలకు నిధులు కేటాయించి పనులు ప్రారంభించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక హోదా సాధన సమితి అధ్యక్షుడు చలసాని శ్రీనివాసరావు, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి రాము, విద్యార్థి సంఘాల రాష్ట్ర నాయకులు ఎ.అశోక్, పి.రాజేంద్ర, శివారెడ్డి, పి.భూషణ్, జాన్సన్‌బాబు, సత్యనారాయణ, రాజేష్, కన్వీనర్ సీహెచ్ పావని, సీపీఎం నాయకుడు ఎస్వీ నాయుడు, ఎస్.రమణ, సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.లోకనాథం, సీపీఐ జిల్లా కార్యదర్శి బాలాపల్లి వెంకటరమణ, ఫణీంద్రకుమార్, ఎస్.భాస్కర్, డివిజన్ కార్యదర్శి గొర్లి తరుణ్, వియ్యపు రాజు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న చలిగాలులు

**సాక్షి, పాడేరు:** జిల్లాలో చలిగాలుల తీవ్రత కొనసాగుతోంది. గురువారం చింతపల్లి వ్యవసాయ పరిశోధన స్థానంలో 9.5 డిగ్రీలు, అరకులోయ కేంద్ర కాఫీబోర్డులో 10.2డిగ్రీలు,పాడేరు మండలం మినుములూరు కేంద్ర కాఫీబోర్డులో 11డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.కొన్ని చోట్ల పొగమంచు దట్టంగా కురిసింది. సాయంత్రం 6గంటల నుంచి చలిగాలులు తీవ్రంగా వీచాయి.

## క్లుప్తంగా

### రూ.20 లక్షలతో జోనల్ కార్యాలయం మరమ్మతులు



మరమ్మతు పనుల్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ జాజుల ప్రసన్నలక్ష్మి

**అనకాపల్లిటౌన్ :** జోనల్ కార్యాలయంలో మరమ్మతుల నిమిత్తం ప్రభుత్వం రూ.20 లక్షల నిధులు మంజూరు చేసినట్టు 83వ వార్డు కార్పొరేటర్, స్టాండింగ్ కమిటీ సభ్యురాలు జాజుల ప్రసన్నలక్ష్మి తెలిపారు. ఈ మేరకు గురువారం కార్యాలయంలో మరమ్మతు పనులను కొబ్బరి కాయ కొట్టి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్న సమయంలో వర్షపునీరు కార్యాలయంలోకి రాకుండా, చిన్నిచిన్న పనుల నిమిత్తం ఈ నిధులు ఖర్చు చేస్తున్నట్లు ఆమె చెప్పారు. కార్యక్రమంలో జెడ్సీ వెంకటరమణ, ఏఈ సుమిత్ర, వైఎస్సార్‌సీపీ పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు జాజుల రమేష్, పార్టీ నేతలు బొండా శంకరరావు, గొర్లి చిన్నా, గుండా రమేష్‌గుప్తా, రామారావు, కొడుకుల సుబ్రహ్మణ్యం, జోనల్ సిబ్బంది పాల్గొన్నారు.

### అద్దె భవనాలతో ప్రభుత్వానికి నష్టం

**తుమ్మపాల :** అద్దె భవనాలలో ప్రభుత్వ కార్యాలయాలను నిర్వహించడం వల్ల ప్రభుత్వానికి వేలకోట్ల రూపాయల నష్టం వాటిల్లుతోందని నేషనల్ ఫోరం ఫర్ సోషల్ జస్టిస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సూదికొండ మాణిక్యాలరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంగా ఉన్న అనకాపల్లి జిల్లా కేంద్రంగా మారిందని, అనేక ప్రభుత్వ స్థలాలు పట్టణంలో ఉన్నప్పటికి ప్రైవేటు భవనాలలో కార్యాలయాలను నిర్వహించడం అత్యంత బాధాకరమన్నారు. మరమ్మతులకు గురైన ప్రభుత్వ భవనాలకు తక్కువ ఖర్చుతో మరమ్మతులు చేపట్టి అందుబాటులోకి తీసుకురావచ్చని సూచించారు. నిరుపయోగంగా ఉన్న పలు ప్రభుత్వ కార్యాలయాలు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయన్నారు. ప్రభుత్వ అధికారులు, ప్రజాపాలకులు దృష్టి సారించి సొంతభవనాల నిర్మాణానికి నిధులు విడుదలయ్యేలా కృషి చేయాలన్నారు.

### 10న కనకదుర్గమ్మ విగ్రహ ప్రతిష్ట

**అనకాపల్లిటౌన్ :** మండలంలోని బట్లపూడి సోహం ఆశ్రమంలో ఈ నెల 8, 9, 10 తేదీల్లో పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు సోహం స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు రవి చెప్పారు. గురువారం కనకదుర్గమ్మవారికి నీటి, పాలు, ధాన్యంతో అభిషేకాలు జరిగాయి. శుక్రవారం అన్నసమారాధన ఏర్పాటు చేసినట్టు తెలిపారు. 10వ తేదీన కనదుర్గమ్మ విగ్రహాన్ని ఆశ్రమంలో ప్రతిష్ఠించనున్నట్టు వెల్లడించారు.

### అనకాపల్లి సినిమాలు

| | |
|---|---|
| మైఖేల్ | - రాజా |
| సిందూరం | -సత్యనారాయణ స్క్రీన్-1 |
| పఠాన్ | -సత్యనారాయణస్క్రీన్-2 |
| 18 పేజెస్ | -షిర్డిసాయి |
| పఠాన్ | -పర్తిసాయి |
| వీరసింహారెడ్డి | -వెంకటేశ్వర |
| హంట్ | - శ్రీసత్య |
| వాల్తేరు వీరయ్య | - రామచంద్ర |

### బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు గురువారం 6,795 బెల్లం దిమ్మలు వచ్చాయి.

| దిమ్మల రకం | కనిష్ట ధర | గరిష్ట ధర |
|---|---|---|
| స్పెషల్ | 3,500 | 4,200 |
| మొదటి రకం | 3,320 | 3,610 |
| రెండో రకం | 2,960 | 3,400 |
| మూడో రకం | 2,850 | 2,950 |

### రక్త నిల్వలు

**అనకాపల్లిటౌన్ :** జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 37 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-12 యూనిట్లు , బీ పాజిటివ్-7 యూనిట్లు, బీ నెగిటివ్-1 యూనిట్, ఓ పాజిటివ్-10 యూనిట్లు, ఓ నెగిటివ్-4 యూనిట్లు, ఏబీ పాజిటివ్-3 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయ బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9182834480)ను సంప్రదించవచ్చు.

### గ్యాస్ సమాచారం

**అనకాపల్లిటౌన్ :** ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా గురువారం 394 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న 365 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ (9441108144)ని సంప్రదించవచ్చు.



# ప్రగతిపథంలో తాళ్లపాలెం



తాళ్లపాలెం ఎన్టీఆర్ కాలనీలో సిమెంట్ రోడ్లు, మురుగు కాలువల నిర్మాణం



తాళ్లపాలెంలో తుది దశకు చేరుకున్న 2వ సచివాలయ భవన నిర్మాణం



ఇంటింటికీ కుళాయిలు ఇవ్వడానికి పైపులైన్ నిర్మాణం



వైఎస్సార్ జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలు

- మూడున్నరేళ్లలోనే ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు
- నాడు-నేడుతో పాఠశాలల్లో సమూల మార్పులు
- రోడ్లు, కాలువలు, భవనాల నిర్మాణంతో ఆనందం

**కశింకోట :** మండలంలోని తాళ్లపాలెం మేజర్ పంచాయతీ ప్రగతి పథం వైపు దూసుకుపోతోంది. గతంలో ఎన్నడూలేని విధంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు జరిగాయి. మరికొన్ని పనులు ప్రస్తుతం జరుగుతున్నాయి. కశింకోట తర్వాత మండలంలో రెండో మేజర్ పంచాయతీ తాళ్లపాలెంలో సుమారు 5 వేల మంది నివసిస్తున్నారు. రెండు సచివాలయాలను ఇక్కడ ఏర్పాటు చేశారు. వీటి పరిధిలో గత మూడున్నరేళ్లలో రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ సమకూర్చిన నిధులతో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు.

**రోడ్లు.. కాలువలు.. భవనాలు**

పంచాయతీ పరిధిలో రూ.కోటికి పైగా నిధులను వెచ్చించి రోడ్లు, కాలువలు, సచివాలయ భవనాలను నిర్మిస్తున్నారు. కొన్ని పనులు ఇప్పటికే తుది దశకు చేరుకున్నాయి. బాలికల గురుకుల పాఠశాల పక్కన రూ.40 లక్షలతో సచివాలయం-2 నూతన భవన నిర్మాణం తుది దశకు చేరుకుంది. రంగులు వేసి త్వరలో ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ సచివాలయాన్ని తాత్కాలికంగా సామాజిక భవనంలో నిర్వహిస్తున్నారు. పంచాయతీ కార్యాలయం వద్ద రూ.23 లక్షలతో మరో సచివాలయాన్ని నిర్మించారు. గురుకుల పాఠశాల-గంగడోలు రోడ్డు, 1వ వార్డులో రెండు వీధుల్లోను, పాల కేంద్రం గుమ్మడి వారి వీధిలోను రూ.20 లక్షలతో సిమెంట్ రోడ్లు నిర్మించారు. 1వ వార్డులో మురికి కాలువలను రూ.7 లక్షలతో నిర్మించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మరో రూ.20 లక్షలు మంజూరు చేశారు. దీంతో ఎన్టీఆర్ కాలనీలో కాలువల నిర్మాణం చేపట్టారు. పనులు చివరి దశకు చేరుకున్నాయి.

**ఇంటింటికీ కుళాయిలు**

జల్ జీవన్ మిషన్ కార్యక్రమంలో భాగంగా తాళ్లపాలెంలో ఇంటింటికీ కుళాయిల ఏర్పాటుకు రూ.25 లక్షలతో భూగర్భ పైపులైన్ పనులు చేపట్టారు. గొల్లపేట, సంత ప్రాంతాల్లో ఇప్పటికే రూ.5 లక్షలతో ఇంటింటికీ కుళాయిలు ఇచ్చారు. ప్రస్తుతం మిగిలిన నిధులతో తాళ్లపాలెం కూడలి నుంచి చెరువు వరకు కుళాయిలు ఇవ్వడానికి పైపులైన్ నిర్మాణం పనులు చురుగ్గా సాగుతున్నారు. వీటి అనంతరం తాళ్లపాలెం ప్రాంతంలో కూడా ఇంటింటికీ కుళాయి కనెక్షన్లు ఇవ్వనున్నారు.

**నాడు-నేడుతో మరింత అభివృద్ధి**

నాడు-నేడు పథకంలో భాగంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రూ.45 లక్షలతో అభివృద్ధి పనులు పూర్తి చేసి, అందుబాటులోకి తీసుకొచ్చారు. 2వ ప్రాథమిక పాఠశాలను నాడు-నేడులో భాగంగా రూ.18 లక్షలతో మౌలిక సదుపాయాలతోపాటు, అందమైన రంగులు వేసి చూడ ముచ్చటగా తీర్చిదిద్దారు. 1వ ప్రాథమిక పాఠశాలలో రూ.16 లక్షలతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. బంగారయ్యపేటలో చిన్న అంగన్‌వాడీ కేంద్ర భవనాన్ని రూ.14 లక్షలతో నిర్మిస్తున్నారు. రూ.23 లక్షలతో రైతు భరోసా కేంద్రం నిర్మాణం చేపట్టారు. మరో రూ.23 లక్షలతో అదనపు నిర్మాణం చేపట్టాల్సి ఉంది.

**98 మందికి జగనన్న ఇళ్లు**

జగనన్న గృహ నిర్మాణ పథకంలో 98 మందికి ఇళ్ల స్థలాలు ఇచ్చారు. ఇళ్లు నిర్మాణాలకు ఆమోదం తెలిపారు. ఇప్పటికే సుమారు 20 మంది ఇళ్లు నిర్మించుకున్నారు. కొందరు గృహ ప్రవేశాలు కూడా పూర్తి చేసుకుని, వాటిలో నివసిస్తూ ఆనందంగా ఉన్నారు. మిగిలిన వారు కూడా ఇళ్ల నిర్మాణంలో బిజీగా ఉన్నారు. ఇళ్ల స్థలాల విలువ, ప్రభుత్వ ఆర్థిక సాయం కలిపి సుమారు రూ.3 కోట్లు వరకు ఇక్కడి లబ్ధిదారులకు ప్రయోజనం చేకూరుస్తున్నారు. మౌలిక వసతుల ఏర్పాటుకు మరింత మొత్తం వెచ్చిస్తున్నారు. తమ కాలనీ పూర్తయితే ఓ చిన్నపాటి గేటెడ్ కమ్యూనిటీ మాదిరిగా ఉంటుందని, లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

**ఊహించలేని స్థాయిలో అభివృద్ధి**



తాళ్లపాలెం పంచాయతీ పరిధిలో గతంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి జరుగుతోంది. జగనన్న నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ మూడున్నరేళ్ల పాలనలో అనేక అభివృద్ధి పనులు చేపట్టారు. వీటిలో కొన్ని పనులు ఇప్పటికే పూర్తి కాగా, మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయి. ప్రభుత్వ కార్యక్రమాల పట్ల ప్రజలు సంతృప్తిగా ఉన్నారు. మా ప్రాంతం ఈ స్థాయి అభివృద్ధిని చూస్తుందని కల్లోకూడా ఊహించలేదు.

–లగిశెట్టి భవాని, ఎంపీటీసీ సభ్యురాలు, తాళ్లపాలెం.

### చిన్న వయసులో చికిత్సతో సత్ఫలితాలు



గ్రహణం మొర్రి చిన్నారిని పరిశీలిస్తున్న వైద్యుడు ముకుందరెడ్డి

**అనకాపల్లిటౌన్ :** గ్రహణం మొర్రి, గ్రహణ శూల బాధితులు చిన్న వయస్సులో శస్త్రచికిత్స చేయించుకోవడం ద్వారా సత్ఫలితాలుంటాయని హైదరాబాద్ బసవతారకం ఇండో అమెరికన్ ఆస్పత్రి వైద్యుడు డి.ముకుంద రెడ్డి అన్నారు. గవరపాలెం గౌరీగ్రంథాలయం ఆవరణలో ఏపీ సమగ్రశిక్ష-సహిత విద్యా విభాగం ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్యశిబిరం జరిగింది. అవసరమైన బాధితులకు శస్త్రచికిత్సలు నిర్వహించడమే కాకుండా రవాణా ఖర్చులు కూడా తామే భరిస్తామన్నారు. ఇదే ఆపరేషన్ ప్రైవేటుగా చేయించుకుంటే రూ.80 వేలు నుంచి రూ.లక్ష వరకు ఖర్చవుతుందని పేర్కొన్నారు. ఈ వైద్య శిబిరంలో 24 మండలాల ప్రత్యేక ఉపాధ్యాయులు, దివ్యాంగ విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా సహిత విద్య సమన్వయకర్త బి.శకుంతల, ఎంఈవో దివాకర్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

### స్థిరంగా కూరగాయల ధరలు

**కశింకోట :** కశింకోటలోని వారపు సంతలో గురువారం కూరగాయల ధరలు దాదాపు స్థిరంగా ఉన్నాయి. కిలో ఉల్లి, టమాటా, బంగాళాదుంప రూ.20, చిక్కుడు, వంకాయ రూ.30, బీట్‌రూట్, క్యారెట్, బీన్స్ రూ.40, కాకర, బెండ, దొండ రూ.60, క్యాప్సికం రూ.80, గోబీపువ్వు ఒకటి రూ.20కి అమ్మకాలు సాగాయి.

## 6న కలెక్టరేట్ వద్ద అంగన్‌వాడీల ధర్నా



సూపరింటెండెంట్ పద్మకళకు వినతిపత్రం అందిస్తున్న కాసులమ్మ, పార్వతి

**అనకాపల్లిటౌన్ :** అంగన్‌వాడీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 6న కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ) పట్టణ అధ్యక్షురాలు కె.కాసులమ్మ తెలిపారు. ఈ మేరకు గవరపాలెం అంగన్‌వాడీ జిల్లా కార్యాలయంలో సూపరింటెండెంట్ డి.పద్మకళకు గురువారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ఫేస్‌యాప్ రద్దు చేయాలని, పర్యవేక్షణ పేరుతో వేధింపులు ఆపాలని, వైఎస్సార్ సంపూర్ణ పోషణ మెనూ చార్జీలు పెంచాలని, గ్యాస్ సిలిండర్లను ప్రభుత్వమే సరఫరా చేయాలని తదితర డిమాండ్లను వినతి పత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో యూనియన్ ప్రతినిధులు ఉమానారాయణమ్మ, కె.పార్వతి, జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ఎఫ్ఏసీ తహసీల్దార్‌గా సురేష్‌నాయుడు



**కశింకోట :** మండల తహసీల్దారుగా హెచ్‌డీటీ కె.సురేష్‌నాయుడుకు పూర్తి అదనపు బాధ్యతలు(ఎఫ్ఏసీ) అప్పగిస్తూ జిల్లా కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. విధుల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించారనే అభియోగంపై తహసీల్దార్ బి.సుధాకర్‌ను సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో హెచ్‌డీటీకి ఎఫ్ఏసీ బాధ్యతలు అప్పగించారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**కశింకోట :** మండలంలోని కన్నూరుపాలెం విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా దీని పరిధిలో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు నర్సీపట్నం విద్యుత్ శాఖ కార్యాలయం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి.సురేష్‌బాబు, తాళ్లపాలెం ఏఈ బీఎల్‌వీ నాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని కన్నూరుపాలెం, తీడ, ఆనందపురం, చెరకాం, కచ్చర్లపాలెం, లాలం కొత్తూరు, చిన్నయ్యపాలెం, జి.భీమవరం, అడ్డాం, అచ్చెర్ల, మోసయ్యపేట, గోకివానిపాలెం, సింగవరం గ్రామాల్లో వ్యవసాయం, ఇళ్లకు విద్యుత్ సరఫరా ఉండబోదన్నారు. అలాగే రామన్నపాలెం ఫీడర్ పరిధిలోని రామన్నపాలెం, శెట్టిపాలెం, దుంగవానిపాలెం, జెడ్ గంగవరం, ఎరకన్నపాలెం, ధర్మవరం, వెంకటాపురం, చినరాచపల్లి, వెంకన్నపాలెంలోను, భీమబోయిన పాలెం ఫీడర్ పరిధిలోని రాజుపేట, భీమబోయినపాలెం, గండిపేట, చింతలూరు(మాకవరపాలెం), సన్ రే ఫీడర్(కశింకోట), తోటకూరపాలెం(రావికమతం) క్వారీలకు కూడా నిర్ణీత సమయంలో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు. వినియోగదారులు సహకరించాల్సిందిగా కోరారు.

## చదువు, సాంకేతికతతో ఉన్నత స్థాయి



శ్రీ గౌరీ గ్రంథాలయం వార్షికోత్సవంలో మాట్లాడుతున్న బుద్ధ చంద్రశేఖర్

**తుమ్మపాల :** చదువుతో పాటు వృత్తి నైపుణ్యం, ఆధునిక టెక్నాలజీపై అవగాహన కలిగి ఉండాలని ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ చీఫ్ కోఆర్డినేటింగ్ అధికారి బుద్ధ చంద్రశేఖర్ అన్నారు. పట్టణంలో గవరపాలెం శ్రీగౌరీ గ్రంథాలయం 80వ వార్షికోత్సవం సందర్భంగా ఉన్నత విద్య, నైపుణ్యం, ఉపాధి అంశంపై గురువారం సాయంత్రం విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ కేవలం చదువుపై మాత్రమే ఆధారపడిన అనేక మంది విద్యార్థులకు సమాజంలో అనేక అంశాలపై కనీస అవగాహన ఉండట్లేదని, చదువుతో పాటు అన్ని అంశాలపైనా దృష్టి సారించాలన్నారు. ప్రస్తుత ఆధునిక పోటీ ప్రపంచంలో చదువు మాత్రమే ప్రాధాన్యం కాదని, కనీసం ఏదో ఒక అంశంలో వృత్తి నైపుణ్యం కలిగి ఉండాలన్నారు. మాధ్యమాల ద్వారా చదువుకునే ఈ తరుణంలో టెక్నాలజీ అభివృద్ధి చేసుకోవాలన్నారు. ప్రాథమిక విద్య స్థాయి నుంచే క్రీడలను అలవర్చుకునేలా పిల్లలను ప్రోత్సహించాలన్నారు. నిరుద్యోగులకు శ్రీగౌరీ గ్రంథాలయం 80 ఏళ్లగా సేవలు అందిస్తూ, అనేక మంది ఉద్యోగాలు పొంది, ఉన్నత స్థాయికి చేరేందుకు దోహదపడిందన్నారు. వార్షికోత్సవం సందర్భంగా పాలకమండలి సభ్యులు ఆయన్ని సత్కంచారు. కార్యక్రమంలో గ్రంథాలయం అధ్యక్షుడు దొడ్డి నూకఅప్పారావు, కార్యదర్శి కాండ్రేగుల వెంకటరమణ, కోశాధికారి భీశెట్టి కృష్ణఅప్పారావు, కన్వీనర్ మళ్ల బాపునాయుడు, విద్యార్థులు, ఉద్యోగార్థులు పాల్గొన్నారు.

## కొండకర్ల ఆవలో చిత్తడి నేలల దినోత్సవం



ప్రదర్శనను తిలకిస్తున్న విద్యార్థులు

**అచ్యుతాపురం(అనకాపల్లి):** కొండకర్ల ఆవ ప్రాంతంలో గురువారం ప్రపంచ చిత్తడినేలల దినోత్సవం జరిగింది. కార్యక్రమంలో పక్షులు, చేపలు తదితర స్టాల్స్ ఇందిరాగాంధీ జంతుప్రదర్శనశాల, స్థానిక మత్స్యకార సంఘాల నేతలు ఏర్పాటు చేశారు. విద్యార్థులు భారీగా హాజరై తిలకించారు.

## 'చెరకు రైతుల్ని ఆదుకోవాలి'

**కశింకోట :** చెరకు సాగు, బెల్లం తయారీ రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని మాజీ ఎమ్మెల్యే పీలా గోవిందసత్యనారాయణ ప్రభుత్వాన్ని కోరారు. మండలంలోని మోసయ్యపేట, గోకివానిపాలెం గ్రామాల్లో చెరకు సాగు, బెల్లం తయారీ రైతులను గురువారం కలిసి వారి సమస్యలు తెలుసుకున్నారు. చెరకు ఎదుగుదల లేక దిగుబడి తగ్గిపోతోందని, బెల్లం తయారు చేసి మార్కెట్‌కు తరలిస్తే గిట్టుబాటు ధర లభించడం లేదని, నల్లబెల్లం అయితే అధికారుల నుంచి ఇబ్బంది ఎదురవుతోందని రైతులు వాపోయారు. దీంతో మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ చెరకు సాగు రైతుల సమస్య పరిష్కారానికి తుమ్మపాల చెరకు కర్మాగారాన్ని తక్షణమే తెరిపించి చెరకు రైతులను ఆదుకోవాలన్నారు. నల్ల బెల్లం పేరుతో ఇబ్బందులకు గురి చేస్తే ఉద్యమించాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు కాయల మురళీధర్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



## సాగునీటి చెరువు ఆక్రమణకు అడ్డుకట్ట

**నబ్బువరం :** మండలంలోని బంగారమ్మపాలెంలో సాగునీటి చెరువు ఆక్రమణ యత్నానికి రెవెన్యూ అధికారులు బ్రేక్ వేశారు. పోలీసుల సాయంతో పొక్లెయిన్‌తో గురువారం ఆక్రమణలు తొలగించేందుకు చర్యలు చేపట్టారు. వివరాలు.. బంగారమ్మపాలెం గ్రామంలో సర్వే నెంబర్ 49, 50, 52లలో సుమారు 20 ఎకరాల్లో సోమునాయుడు చెరువు ఉంది. దీని పరిధిలో సుమారు 250 ఎకరాల ఆయకట్టు భూమిని 100 మంది వరకూ రైతులు సాగుచేసుకుంటున్నారు. ఈ చెరువును ఆనుకుని దాడి శ్రీరాంమూర్తి కుటుంబ సభ్యులకు జిరాయితీ భూములు ఉన్నాయి. దీంతో పక్కన ఉన్న రైతులు కావడంతో పొక్లెయిన్‌తో పనులు చేపడుతూ చెరువును ఆక్రమించేస్తున్నారని గ్రామానికి చెందిన రైతులు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో తహసీల్దార్ ఆదేశాల మేరకు ఆర్ఐ వీరయ్య, ఇరిగేషన్ ఏఈ రామలక్ష్మణలు సిబ్బందితో కలిసి ఆక్రమణలను పరిశీలించారు. చెరువు గర్భం ఆక్రమించుకున్నట్టు గుర్తించి పోలీసుల సాయంతో తొలగించేందుకు చర్యలు చేపట్టారు. కొంత సేపు పనులు చేపట్టిన తర్వాత ఆక్రమణకు పాల్పడిన రైతులు వివాదానికి దిగి పనులను అడ్డుకున్నారు. గ్రామ పెద్దలు పలువురు మాట్లాడుతూ పూర్వీకుల నుంచి ఈ భూమి చెరువు గర్భంగానే ఉందన్నారు. గతంలో కూడా ఈ భూమి తమదని వివాదానికి దిగిన పరిస్థితులు ఉన్నాయన్నారు. అయినప్పటికీ అది చెరువు గర్భంగానే ఉందని తెలిపారు.

## అభ్యంతరాలున్న గ్రామాల్లో మరోసారి భూముల సర్వే

**కశింకోట :** మండలంలో సమగ్ర భూముల రీ-సర్వే నిర్వహించిన 22 రెవెన్యూ గ్రామాల్లో అభ్యంతరాలున్న భూములకు శుక్రవారం నుంచి 20 రోజులపాటు మళ్లీ సర్వే చేయనున్నట్లు తహసీల్దార్ కె.సురేష్‌నాయుడు గురువారం తెలిపారు. జిల్లా కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి ఆదేశాల మేరకు మళ్లీ భూముల సర్వే జరపనున్నట్లు పేర్కొన్నారు. భూముల సర్వే సక్రమంగా జరగలేదని భావించిన రైతుల అభ్యంతరాలను స్వీకరించి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఇందుకు వీఆర్‌వోలు, గ్రామ సర్వేయర్లు ప్రతి సచివాలయంలోను ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు 20 రోజులపాటు అందుబాటులో ఉంటారన్నారు. దీన్ని రైతులు వినియోగించుకుని, తమ అభ్యంతరాలను పరిష్కరించుకోవాలని సూచించారు. మండలంలోని తీడ, ఏనుగుతుని, బయ్యవరం, ఉగ్గినపాలెం, నూతలగుంటపాలెంలో సర్వే పూర్తి కావలసి ఉందన్నారు. అటవీప్రాంతం కొమర్లోవలో సర్వే భూములు లేవన్నారు. మిగిలిన గ్రామాల్లో సర్వే సవ్యంగా జరగలేదని ఉన్నతాధికారుల విచారణలో వెల్లడైన నేపథ్యంలో మరోసారి సర్వే చేయనున్నట్టు వెల్లడించారు. కశింకోట, వెదురుపర్తి, తేగాడ, పేరంటాలపాలెం, కొత్తపల్లి, బుచ్చియ్యపేట, తాళ్లపాలెం, గైతులపాలెం, అచ్చెర్ల, జి.భీమవరం, సింగవరం, సుందరయ్యపేట, ఇ.చౌడువాడ, చెరకాం, గొబ్బూరు, ఏఎస్ పేట, నరసాపురం, గొబ్బూరుపాలెం, సోమవరం, చింతలపాలెం, జెట్టపురెడ్డితుని గ్రామాల్లో మరోసారి సర్వే జరుగుతుందన్నారు.



# సర్కారీ స్కూళ్లలో డిజిటల్ విద్య

- గడప గడపకు మన ప్రభుత్వంలో మంత్రి గుడివాడ అమర్‌నాథ్



మంచినీటి పైపులైన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి గుడివాడ అమర్‌నాథ్



బయ్యవరం ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో డిజిటల్ బోర్డును పరిశీలిస్తున్న మంత్రి అమర్‌నాథ్

**కశింకోట :** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులందరికి డిజిటల్ విద్యను అందుబాటులోకి తీసుకు వచ్చేందుకు చర్యలు తీసుకుంటామని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ హామీ ఇచ్చారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా రెండో రోజైన గురువారం మండలంలోని బయ్యవరం గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరును ఆరా తీశారు. పథకాలపై రూపొందించిన బ్రోచర్లను స్థానికులకు అందించారు. కార్యక్రమంలో భాగంగా మండల పరిషత్ ఆదర్శ పాఠశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా నెక్స్ ఎడ్యుకేషన్ సంస్థ విద్యా బోధనకు వీలుగా డిజిటల్ బోర్డును అందించింది. రాష్ట్ర, కేంద్ర సిలబస్‌ను బోధనకు వీలుగా ఈ బోర్డులో నిక్షిప్తం చేశారు. ఆంగ్లం, హిందీ, గణితం సబ్జెక్టులను అందుబాటులో ఉంచారు. యూకేజీ నుంచి పదవ తరగతి వరకు విద్యార్థులకు ఈ బోర్డు ద్వారా శిక్షణ ఇవ్వడానికి అవకాశం కలగనుంది. అయితే పాఠశాలల విభజన వల్ల విద్యార్థుల సంఖ్య తగ్గిపోయిందని పాఠశాల హెచ్ఎం మంత్రి దృష్టికి తీసుకు వచ్చారు. దీనికి స్పందించిన మంత్రి డిజిటల్ విద్య అందరికీ అందుబాటులోకి వస్తే విద్యార్థుల సంఖ్య దానికదే పెరుగుతుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. సాంకేతిక పరమైన సమస్యల వల్ల ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందని వారి పట్ల సచివాలయ సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకుని వారికి పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలు ప్రస్తావించిన సమస్యలను కూడా త్వరితగతిన పరిష్కరించాలన్నారు. గ్రామంలో తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టనున్నట్టు భరోసానిచ్చారు. బయ్యవరంలో రూ.48 లక్షలతో ఇంటింటికీ కుళాయిలు ఇవ్వడానికి అవసరమైన పైపులైన్ నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. మహిళల వ్యక్తిగత సమస్యలపై అవగాహన కలిగించేందుకు ఈ నెల 6 వరకు గ్రామాల్లో జరగనున్న స్వాభిమాన్ కార్యక్రమ ర్యాలీని మంత్రి ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ గొల్లవిల్లి జయ, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు, మండలాధ్యక్షుడు గొల్లవిల్లి శ్రీనివాసరావు, ఎంపీడీవో కొంకి అప్పారావు, ఎంపీటీసీ సభ్యుడు గొన్నా నాగ సత్యనారాయణ, ఉప సర్పంచ్ చోడే నాగరాజు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మలసాల కిషోర్, డైరెక్టర్ నీటిపల్లి లక్ష్మి, అనకాపల్లి ఎంపీపీ గొర్లి సూరిబాబు, రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి పలకా రవి, స్థానిక నాయకులు గొల్లవిల్లి బాబూరావు, గొల్లవిల్లి నానాజీ, దాసరి బాబు, బరుకు హర్ష, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.